తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
19 సెప్టెంబర్ 2026

# పేట బస్టాండ్‌లో ఖాళీ జాగా కనిపిస్తే కబ్జానే!



- ప్రజా అవసరాల భూమిపై అక్రమణదారుల కన్ను
- అనుమతులు లేకుండానే నిర్మాణాలా?
- ఏటీఎం ముందు ఆక్రమణ.. బస్టాండ్ ముందు దుకాణాల సముదాయం!
- చోద్యం చూస్తున్న గ్రామపంచాయతీ, ఆర్టీసీ యంత్రాంగం?
- బస్సుల రాకపోకలకు ఇబ్బందులు.. ప్రయాణికులకు తప్పని తిప్పలు






**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ ఆవరణలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా అవసరాలు, ప్రయాణికుల సౌకర్యాలు, బస్సుల రాకపోకలకు ఉపయోగపడాల్సిన ఖాళీ స్థలాలు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. హద్దులు పెట్టడం, షెడ్లు వేయడం, నిర్మాణాలు చేపట్టడం పరిపాటిగా మారిందని ఆరోపిస్తున్నారు.

**అనుమతులు లేకుండానే నిర్మాణాలా?**

బస్టాండ్ పరిధిలో గ్రామపంచాయతీ అనుమతులు లేకుండానే కొన్ని నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా? ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలకు ఎవరు అనుమతిచ్చారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా నంబర్ వన్ ఏటీఎం ముందు భాగంలో ఆక్రమణకు గురైన స్థలం, బస్టాండ్ ముందు ప్రాంతంలో వెలిసిన దుకాణాల సముదాయంపై అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**బస్టాండ్ కుంచించుకుపోతుందా?**

బస్టాండ్ ఆవరణలోని స్థలాలు ఒక్కొక్కటిగా ఆక్రమణలకు గురవుతున్నట్లయితే భవిష్యత్తులో బస్సుల రాకపోకలు, పార్కింగ్, ప్రయాణికుల సౌకర్యాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే రద్దీ సమయాల్లో బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొన్ని సందర్భాల్లో రహదారిపైనే ప్రయాణికులను ఎక్కించుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

దీంతో ప్రధాన రహదారిపై రద్దీ పెరగడంతో పాటు ప్రయాణికుల భద్రతపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల కోసం కేటాయించిన స్థలం తగ్గిపోతే.. భవిష్యత్తులో ప్రజలకే ఇబ్బందులు తప్పవని స్థానికులు అంటున్నారు.

**అధికారుల మౌనం ఎందుకు?**

బస్టాండ్ పరిసరాల్లో ఆక్రమణలపై గ్రామపంచాయతీ, ఆర్టీసీ అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ స్థలాలను గుర్తించి, హద్దులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు కేవలం కంటి తుడుపు చర్యలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల పర్యవేక్షణ లోపిస్తే ఆక్రమణలు మరింత విస్తరించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక్క బస్టాండ్ స్థలానికి సంబంధించిన సమస్య కాదని.. ప్రజా ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన అంశమని వారు పేర్కొంటున్నారు.

**హద్దులు నిర్ణయించి.. ఆక్రమణలు తొలగించాలి...**

బస్టాండ్ పరిధిలోని మొత్తం ప్రభుత్వ భూమిని అధికారులు సర్వే చేసి, అధికారిక హద్దులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మించిన నిర్మాణాలు, ఆక్రమణలకు గురైన స్థలాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బస్టాండ్ భూములను భవిష్యత్ అవసరాల కోసం రక్షించడంతో పాటు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సుల రాకపోకలకు తగిన స్థలం అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెద్ద శంకరంపేట బస్టాండ్ పరిధిలో సమగ్ర స్థల పరిశీలన నిర్వహించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించకపోతే సమస్యను ఉన్నతస్థాయికి తీసుకెళ్లి ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని స్థానిక యువత, ప్రయాణికులు హెచ్చరిస్తున్నారు.

## వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రుణాలను మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి






**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** ప్రాధాన్యత రంగాలకు, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రుణాలను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ మరియు జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రాధాన్యత రంగాల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడం పురోగతి బాగానే ఉందని, అయినప్పటికీ ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని, అవసరమైతే రైతుల కోసం ప్రత్యేక మేళాను ఏర్పాటు చేసి రుణాలను అందించేలా చూడాలని అన్నారు. వివిధ శాఖల ద్వారా గ్రౌండింగ్ కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పరిశ్రమలు, ఉపాధి కల్పన శాఖలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడకుండా, రబీ సీజన్‌లో రుణాల కోసం వచ్చే రైతులకు అవసరమైన సహకారం అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకుల్లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులపై వెంటనే స్పందించి అర్హులకు ప్రయోజనం చేకూర్చేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉన్న పక్షంలో అందులో అర్హులైన లబ్ధిదారులకు సహకారం అందించాలని సూచించారు. ప్రాధాన్యత రంగాలు, వ్యవసాయ రంగంలో పనితీరు తక్కువగా ఉన్న బ్యాంకులు ప్రత్యేక రుణమేళాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సెప్టెంబర్‌లోగా రుణమేళాలు నిర్వహించి, ఆయా బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. తదుపరి సమావేశం నాటికి నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేసిన ముగ్గురు ఉత్తమ పనితీరు కనబరిచిన బ్యాంకు అధికారులను సత్కరించాలని సూచించారు.

మహిళా సంఘాలకు నిర్దేశించిన మేరకు రుణాలు మంజూరు చేయాలని, లక్ష్యాన్ని సాధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చీకోడ్, జగదేవపూర్, కోహెడ ఎస్బీఐ బ్యాంకులను బదిలీ చేయడానికి మరియు బ్యాంకింగ్ సేవలు లేని చెప్యాల, ఎల్లారెడ్డిపేట, కొండపోచమ్మ దేవాలయం రెవెన్యూ గ్రామాల్లో వద్ద నూతన బ్రాంచీలను ఏర్పాటు చేయడానికి వచ్చిన అభ్యర్థనలకు డీఎల్సీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో ఎల్డీఎం హరిబాబు, డిఆర్డిఓ రమేష్, ఆర్బిఐ ఎల్డిఓ వెన్న శ్రీనివాస్, ఎస్బిఐ ఆర్ఎం మారుతి, టిజిబి ఆర్ఎం రాజయ్య, ఏండిసిసిబి జిఎం శ్రీనివాస్, అర్ శెట్టి డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాజాపూర్ అంగన్వాడి కేంద్రం

## వరండాలో మందుబాబుల వీరంగం

- చిన్నారు విద్యార్థులకు భరోసా ఏదీ!
- పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా మారిన ఇంకుడు గుంత



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** మండలం ఖాజాపూర్ గ్రామంలోని ప్రాథమిక కొన్నత పాఠశాల ఆవరణలో గల అంగన్వాడి కేంద్రానికి చెందిన అధికారులు జలసిరి కింద ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. దీంతో వర్షానికి గుంతనిండా నీళ్లు నిండడంతో పక్కనే అంగన్వాడి కేంద్రంకు వచ్చే చిన్నారులు ఆడుతూ పాడుతూ గుంత వద్దకు వెళ్లి పడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆటలు ఆడుకుంటారు. ప్రమాదవశాస్తూ ఈ గుంతలో పడే అవకాశం ఉన్నందున ఈ గుంతను తొలగించాలని లేదా ఇంకుడు గుంతను తొందరగా పూర్తి చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. ప్రమాదం జరుగక ముందే గుంత మూసేసి జాగ్రత్త పడాలని అధికారులకు సూచించారు. కాగా అంగన్వాడి కేంద్రం మందుబాబులకు అడ్డగా మారిందని, కొంతమంది వ్యక్తులు రాత్రిపూట మద్యం తాగుతూ, మద్యం గిలాసలు, వాటర్ ప్యాకెట్లు, కాగితాలతో దర్శనమిస్తున్నట్లు గ్రామస్తులు మండిపడ్డారు. పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు లేకపోవడం ఒక్క సీసీ కెమెరా ఉన్న అది పనిచేయకపోవడం మందుబాబులకు అడ్డగా మారింది ఇలాంటి ద్విచరులకు పాల్పడిన వ్యక్తులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు అంగన్వాడి స్కూల్ అంటే చిన్నారుల దేవాలయం ఇలాంటి ప్రదేశాలలో మందు సీసాలు పడడం తెలివి లేని మూర్ఖులు చేసే పని అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు విద్యాలయాల ముందు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఎంతటి వాడినైనా ఉపేక్షించేది లేదని గ్రామ సర్పంచ్ మన్నే బాలస్వామి ఉప సర్పంచ్ పెద్ద అక్బర్ పంచాయతీ సెక్రెటరీ ప్రభాకర్ పాలకవర్గ సభ్యులు హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.

# విద్యార్థులను పరామర్శించిన వేణుమాధవ్




• ఆసుపత్రి తీరుపై ఆగ్రహం

**సదాశివపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** మునిపల్లి మండలం పెద్దలోడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విషపూరిత ఆహారం తిని అస్వస్థతకు గురైన సుమారు 30 మంది విద్యార్థులను తెలంగాణ రక్షణ సేన జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి నెమలికొండ వేణుమాధవ్ శుక్రవారం పరామర్శించారు. సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పండ్లు, ఆహారం అందించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డ్యూటీ డాక్టర్ శిరీషను కోరారు. ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు చిన్నారులకు చికిత్స అందించ డంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో తగినన్ని బెడ్లు, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహారంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, మౌలిక వసతులపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెంటనే సమీక్ష నిర్వహించాలని వేణుమాధవ్ కోరారు. కార్యక్రమంలో మద్ది శ్రీనివాస రెడ్డి, శంకర్‌నాయక్, కృష్ణారెడ్డి, పరమేశ్వర్, బస్వరాజ్, బెస్త రాము, నర్సిములు, వాజీద్, శ్రీనివాస్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన.. ఎస్పీ పరితోష్ పంకజ్




**సదాశివపేట, సెప్టెంబర్ 18(జనంసాక్షి):** సదాశివపేట పట్టణంలోని ఉభ చెరువులో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు, ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి నిమజ్జనం రూట్‌ను స్వయంగా పరిశీలించారు. ట్రాఫిక్, రహదారులు, విద్యుత్, పారిశుద్ధం, తాగు నీరు, బారికేడ్ల ఏర్పాటుపై సూచనలు చేశారు. నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్ళు, రెవెన్యూ బృందం, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి డీఎస్పీ, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్



**టేక్మాల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** టేక్మాల్‌కు చెందిన కోయలకొండ దుర్గాప్రసాద్‌ను మండల బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా నియమించారు. సంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విట్టల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు దుర్గాప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఓబీసీ వర్గాల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన నాయకులకు దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఓబీసీ మోర్చా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## పిడుగుపాటుకు పాడి గేదె మృతి



**బెజ్జంకి, సెప్టెంబర్ 18(జనంసాక్షి):** మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగుపడి పాడి రైతు దుమాల మహేష్‌కు చెందిన గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు రూ.1.20 లక్షల నష్టం వాటిల్లింది. మహేష్ 20 ఏళ్లుగా వ్యవసాయంతో పాటు పాడి పశువులను పెంచుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పాడి పశువుల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు సాగేవని తెలిపారు. ఎంతో కాలంగా పెంచుకున్న గేదె మృతి చెందడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మహేష్ కోరారు.

## నాన్ టీచింగ్ సేవలకు దరఖాస్తుల ఆహ్వానం


**పుల్కల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** మండల పరిధిలోని బస్వాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతిగృహంలో నాన్ టీచింగ్ సేవలు అందించేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతిగృహం ఇన్‌చార్జి వరలక్ష్మి తెలిపారు. వసతి గృహంలో అసిస్టెంట్ కుక్-2 పోస్టులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 20 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు.అర్హత కలిగిన మహిళలు నేటి నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం బస్వాపూర్ మోడల్ స్కూల్ బాలికల వసతిగృహం ఇన్‌చార్జి వరలక్ష్మిని 9652077673 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## పటేల్ కుంటను పరిశీలించిన డీఎల్పీఓ



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 18 (జనం సాక్షి):** మండలంలోని గజగట్లపల్లి గ్రామంలోని పటేల్ కుంటను మెదక్ డివిజనల్ పంచాయతీ అధికారి యాదయ్య శుక్రవారం పరిశీలించారు.కుంట నిండటంతో నీళ్ళు రోడ్డు పై రావడంతో ఇట్టి విషయం సర్పంచ్ బండారు నాగభూషణండీఎల్పీఓ యాదయ్య దృష్టికి తీసుకపోగా అక్కడే ఉన్న ఏఈ వాసు దేవరావుకు కుంటకు సైడ్ డ్రైన్ ఏర్పాటు చేయాలని ఇర్గేషన్ ఈఈతో మాట్లాడి పనులు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శి సంతోష్ కి పలు సూచనలు చేశారు, తరువాత డంపింగ్ యార్డ్, శ్మశాన వాటిక, నర్సరీ నిర్వహణ పరిశీలించడం జరిగింది, గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం పరిశీలించడం జరిగింది. వీరితోపాటు గ్రామ సర్పంచ్ బండారి నాగభూషణం, ఉపసర్పంచ్ బర్మల రాజు, గిరుకల యాదగిరి, వార్డు సభ్యులు, ముంద్రాతి సాయిబాబు, చికోటి గణేష్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఎస్ జలంధర్ తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**కృష్ణ, సెప్టెంబర్ 18 (జనం సాక్షి):** కృష్ణ మండలం తంగిడి గ్రామంలో గురువారము సాయంత్రం 8:30 గంటల సమయంలో కృష్ణ ఎస్ఐ నవీద్, సిబ్బంది కలిసి దాడి చేశారు. తంగిడి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న హెచ్ నాగేష్, టి మల్లప్ప, నరేష్ కుమార్ సిద్ద లింగ, 5. రాజు ,కేశ్యప్ప కృష్ణ అను వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 10,600 రూపాయలు మరియు పేక ముక్కలు, 2 సెల్ ఫోన్ లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కృష్ణ ఎస్సై తెలిపినారు.

## మానవత్వం చాటుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

• పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత
• అభినందించిన గ్రామస్తులు పలువురు



**చేర్యాల, సెప్టెంబర్ 18(జనంసాక్షి):** మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బోడపట్ల రాజు అనే వ్యక్తి తన వ్యక్తిగత పనుల నిమిత్తం ఆకునూరు గ్రామానికి వచ్చిన క్రమంలో గురువారం రాత్రి తన మొబైల్ ఫోన్ గ్రామంలో రోడ్డుపై పోగొట్టుకున్నాడు. రోడ్డుపై ద్విచక్ర వాహనంతో వెళుతున్న ధూల్మిట్ట గ్రామ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు, ఆకునూరు గ్రామానికి చెందిన కంతుల సంపత్‌కు ఆ మొబైల్ ఫోన్ దొరకడంతో బాధితునికి సమాచారం అందించి శుక్రవారం ఫోన్ అందజేసి మానవత్వం చాటుకున్నారు. బాధిత ఫోన్ యజమాని రాజు ఉపాధ్యాయులు సంపత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయుడు సంపత్‌ని పలువురు అభినందించారు.


## బెజ్జంకి పీఏసీఎస్ వైపు సహకార సంఘాల చూపు

• 37 పీఏసీఎస్ సంఘాల కార్యదర్శుల సందర్శన




**బెజ్జంకి,సెప్టెంబర్ 18,(జనంసాక్షి):** మండల కేంద్రంలో అభివృద్ధిలో దుసుకెళ్తున్నా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ను శుక్రవారం కో-ఆపరేటివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నుండి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ జి.ఎల్.సురేష్,సి.విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పీఏసీఎస్ లను మల్టీపర్పస్ సొసైటీలుగా అభివృద్ధి చేసే శిక్షణలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 37 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు సందర్శించారు. ఈ సందర్భంగా బెజ్జంకి పీఏసీఎస్‌లో రుణాల మంజూరు,వసూళ్ల విధానం,లోనింగ్ ప్రక్రియ, సంఘం నిర్వహిస్తున్న వివిధ వ్యాపార కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు.బెజ్జంకి పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్ మాట్లాడుతూ సంఘంలో రుణాల వ్యవహారాలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సిబ్బంది,కార్యదర్శులు సమిష్టిగా కృషి చేసి సంఘాలను మరింత అభివృద్ధి చేసి లాభాల బాటలో నడిపించాలి అనీ అన్నారు.కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు,మేనేజర్ ప్రవీణ్,కార్యదర్శి,సిబ్బంది పాల్గొన్నారు.

## సింగపూర్ విద్యా పర్యటనకు ఎంపికైన ఉపాధ్యాయుడికి సన్మానం



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ విద్యా పరిశీలన పర్యటనలో భాగంగా సింగపూర్‌కు ఎంపికైన మండల ఉపాధ్యాయుడు బి. ప్రసన్న కుమార్ (ఎస్‌జీటీ)ను అధికారులు ఘనంగా సన్మానించారు.

ఎంఆర్ఓ నారాయణ, ఎంఈఓ వేణుశేఖర్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సింగపూర్‌లో పాఠశాల విద్యా విధానం, వినూత్న బోధనా పద్ధతులు, ఎఫ్ఎల్ఎన్, సాంకేతిక ఆధారిత విద్య, విద్యార్థి కేంద్రిత బోధన, ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, డిజిటల్ లెర్నింగ్ తదితర అంశాలను పరిశీలించే అవకాశం లభించనుంది. అక్కడి ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి, మండలంలోని ఉపాధ్యాయులతో పంచుకోవాలని అధికారులు సూచించారు. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ అవకాశం కల్పించిన విద్యాశాఖకు కృతజ్ఞతలు తెలిపారు. సింగపూర్‌లో నేర్చుకున్న అంశాలను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన ఫలితాల మెరుగుదలకు వినియోగిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొని ఆయనను అభినందించారు.

## కొత్త పింఛన్ల దరఖాస్తులపై విచారణ



బెజ్జంకి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన నూతన పింఛన్ల ప్రక్రియలో భాగంగా దరఖాస్తులపై శుక్రవారం విచారణ నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఏఈఓ రేణుక క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి వివరాలు సేకరించారు. వితంతువులు, వికలాంగులు, వృద్ధులు తదితర కేటగిరీలకు చెందిన దరఖాస్తుదారుల అర్హతలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# 22ఏ భూములపై బీఆర్ఎస్ దుష్ప్రచారం: కాంగ్రెస్

• బీఆర్ఎస్ నేతలు దోచుకున్న భూముల వివరాలు బయటపెడతాం: సత్యం శ్రీరంగం

సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): 22(ఏ) భూముల విషయంలో బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఆరోపించారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి ద్వారా 22(ఏ) నిషేధిత జాబితాలో 22.93 లక్షల ఎకరాలు చేర్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విస్తీర్ణాన్ని ఏడు లక్షల ఎకరాలకు తగ్గించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 22(ఏ)లో 3.75 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కేటీఆర్, హరీశ్‌రావు కోటి ఎకరాలు 22(ఏ)లో ఉన్నాయంటూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని సత్యం శ్రీరంగం విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో అక్రమంగా అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకున్నారని ఆరోపిస్తూ, వాటి వివరాలను బయటపెడతామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి అప్పుల భారం పెరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించిందని తెలిపారు. ఫామ్‌హౌస్ వద్ద నిరసన తెలిపిన దళితులను అవమానించారని, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధికి సీఎం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.



బీఆర్ఎస్‌తో బీజేపీకి లోపాయికారి ఒప్పందం ఉందన్నది తమ ఆరోపణ అని, ఆ కారణంగానే బీజేపీ ఎంపీలు గెలిచారని సత్యం శ్రీరంగం అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంతకిషన్, చేర్యాల ఆంజనేయులు, గడీల రామ్‌రెడ్డి, రఘుగౌడ్, మునిపల్లి సత్యనారాయణ, కూన సంతోష్, కిరణ్ గౌడ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించాలి

• జూలై 2023 నుంచి 41 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి

నంగునూరు, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతిరెడ్డి ఆరోపించారు. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి ప్రకటించాలని, జూలై 2023 నుంచి 41 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.
టీపీటీఎఫ్ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు పోనమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు.
తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ నివేదికను ఈ నెల 9న సమర్పించాలని కమిషన్‌ను ఆదేశించినప్పటికీ, ప్రభుత్వం ఇప్పటివరకు నివేదికను తెప్పించుకోకపోవడం బాధాకరమన్నారు. జేఏసీ సమావేశాన్ని ఈ నెల 21కి వాయిదా వేయడంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో అసంతృప్తి నెలకొందన్నారు.
టీపీటీఎఫ్ మాసపత్రిక 'ఉపాధ్యాయ పత్రిక' సంపాదకుడు ఎస్. కనకయ్య మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు



ఏడు నెలలుగా వేతనాలు అందలేదన్నారు. దసరాలోగా బకాయిలను విడుదల చేయాలని కోరారు.
పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులకు గదులు ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు బదిలీలు, క్రమబద్ధమైన వేతన శ్రేణులు కల్పించాలని, ప్రతి కేజీబీవీకి వార్డెన్లను నియమించాలని కోరారు. రాత్రి విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు తగిన విశ్రాంతి సమయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా నాయకులు ఎ. సత్యనారాయణ, పి. సుశీల, మండల ప్రధాన కార్యదర్శి పి. నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం



నంగునూరు, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలు, వివాదాస్పద పుస్తకాన్ని విడుదల చేస్తానన్న ప్రకటనకు నిరసనగా రాజగోపాల్‌పేట గ్రామ యువత ఆందోళన చేపట్టింది. గ్రామ ప్రధాన రహదారిపై హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేసి, పుస్తకాన్ని వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. అనంతరం హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో యువ నాయకులు ముక్క అనిల్, కాటం వంశీ, తత్తరి రాజు, ముంద్రాతి లింగం, తలారి రాజు, పవన్, సాయిబాబు, కాటంరాజు, బాలరాజు, ప్రవీణ్, శేఖర్, రమేష్‌బాబు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ బాధిత బాలుడికి రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ

మిడ్జిల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న గొడుగు హర్ష కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సహకారంతో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మాజీ ఎంపీటీసీ శివప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి చెక్కును అందించారు. ఈ సాయంతో ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స పొందే అవకాశం ఉందని తెలిపారు. పేద



కుటుంబం ఇబ్బందులను గుర్తించి వెంటనే ఎల్‌ఓసీ మంజూరు చేసిన ఎమ్మెల్యేకు హర్ష కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఈ మొత్తాన్ని నేరుగా ఆసుపత్రికి చెల్లించనుంది.

## పోషకాహారంతో రక్తహీనతను నివారించాలి

ఉప్పునుంతల, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): దేవదారికుంట తండాలో జాతీయ పోషణ మాసం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఎత్తు, బరువులను క్రమం తప్పకుండా నమోదు చేయాలని, పుట్టినప్పటి నుంచి తొలి వెయ్యి రోజుల్లో పోషణ ఎంతో కీలకమని తెలిపారు. పరిశుభ్రత, చేతుల శుభ్రతతో వ్యాధులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ కార్యదర్శి, ఉపాధ్యాయులు, నాయకులు, మహిళలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



# జీవో 97ను రద్దు చేయాలి

• వంటావార్పుతో పాలిటెక్నిక్ ఉద్యోగుల వినూత్న నిరసన
• రాజగోపాలపేటలో నల్లబ్యాడ్జీలతో 31వ రోజు భోజన విరామ నిరసన





నంగునూరు, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను నైపుణ్య విశ్వవిద్యాలయంలో విలీనం చేసే ఉద్దేశంతో జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని పాలిటెక్నిక్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. జీవో రద్దు చేసే వరకు దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి 31వ రోజు భోజన విరామ నిరసన నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో వంటావార్పు చేపట్టి వినూత్నంగా నిరసన తెలిపారు.
ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే నైపుణ్య విశ్వవిద్యాలయంలో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. జీవో 97 అమలైతే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ఉనికికి ముప్పు ఏర్పడటంతో పాటు విద్యార్థుల భవిష్యత్తుపైనా ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ, ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు.
ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, కమిటీ పేరుతో కాలయాపన చేస్తోందని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపించారు. జీవోను రద్దు చేస్తామని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.
కమిషనర్ వైఖరిపై ఉద్యోగుల ఆగ్రహం
సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేనను కలిసేందుకు వెళ్లిన ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులతో ఆమె అనుచితంగా ప్రవర్తించారని ఉద్యోగులు ఆరోపించారు. తమ సమస్యలు, అభ్యంతరాలను పూర్తిగా తెలుసుకోకుండానే మాట్లాడారని పేర్కొన్నారు. ఉన్నతస్థాయి కమిటీకి కమిషనర్ కన్వీనర్‌గా ఉన్నందున సమస్యలను వివరించేందుకు ఆమెను కలిసినట్లు తెలిపారు. తమ పట్ల వ్యవహరించిన తీరుకు కమిషనర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.
జీవో 97పై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు నిరసనలు కొనసాగిస్తామని ఉద్యోగులు తెలిపారు. రాబోయే రోజుల్లో దశలవారీగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# బాలికను వెంటాడిన నిందితుడికి రెండేళ్ల జైలు

### రూ.20 వేల జరిమానా.. పటిష్ఠ సాక్ష్యాలతో శిక్ష: ఎస్పీ శ్రీనివాసరావు



**మెదక్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** బాలికను వెంటాడుతూ, బెదిరింపులకు పాల్పడిన పోక్సో కేసులో నిందితుడికి ప్రత్యేక పోక్సో కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

మెదక్ పట్టణానికి చెందిన రాహుల్ 17 ఏళ్ల బాలికను వెంటాడుతూ, తనతో మాట్లాడకపోతే చనిపోతానంటూ బెదిరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాలికతో దిగిన ఫొటోను వాట్సాప్ స్టేటస్, డీపీగా పెట్టుకుని 'నా భార్య' అని పేర్కొన్నట్లు ఫిర్యాదులో ఉంది. నిందితుడి వేధింపులతో బాలిక తీవ్ర మనస్తాపానికి గురైనట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనపై అప్పటి మెదక్ టౌన్ సీఐ మధు 2022 అక్టోబర్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కీలక సాక్ష్యాలను సేకరించి ఎస్‌ఐ మల్లారెడ్డి పూర్తి ఆధారాలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ రెండేళ్ల జైలు, రూ.20 వేల జరిమానా విధించారు.

మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎస్పీ తెలిపారు. వేధింపులు, వెంటాడడం, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

కేసు దర్యాప్తు, విచారణలో సహకరించిన ఎస్‌ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ రమయ్య, లీగల్ అడ్వైజర్ శ్వేతతో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ఇర్ఫాని దర్గా 24వ ఉర్సు ఉత్సవాలు

- **అక్టోబర్ 1,2 తేదీల్లో నిర్వహణ, ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** సంగారెడ్డి శివారులోని ఇర్ఫాని దర్గా 24వ ఉర్సు ఉత్సవాలను అక్టోబర్ 1,2 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతి ఉమర్ బీన్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉర్సు ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1న గంధం ఊరేగింపు, అఖిల భారత కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కవి సమ్మేళనంలో దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ కవులు పాల్గొంటారని పేర్కొన్నారు. అక్టోబర్ 2న దీపారాధన, ఖవ్వాలి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఉర్సు ఉత్సవాలకు సంగారెడ్డితో పాటు వివిధ ప్రాంతాలు, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు ఉమర్ బీన్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో అన్వర్, అహ్మద్ ఇర్ఫాని, మహమ్మద్, నూమాన్ తదితరులు పాల్గొన్నారు.

# బాదుగుల చెరువు పునరుద్ధరణకు నిధులు.. మంత్రులకు కాంగ్రెస్ నేతల కృతజ్ఞతలు



**కోహెడ, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** కోహెడ మండల కేంద్రంలోని బాదుగుల చెరువు పునరుద్ధరణకు రూ.2.40 కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శెట్టి సుధాకర్ పటేల్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సుధాకర్ పటేల్ మాట్లాడుతూ.. బాదుగుల చెరువు సమస్యను పరిష్కరించడంతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్లమ్మ చెరువు తరహాలో పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇటీవల కోహెడ మండల పర్యటనకు వచ్చిన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్.. మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారని చెప్పారు.

పొన్నం ప్రభాకర్ చొరవతో హుస్నాబాద్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఆయన పేర్కొన్నారు. కోహెడ మండలం తంగళ్లపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేసి, వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

కార్యక్రమంలో సర్పంచ్ బందెల సుజాత-బాలకిషన్, సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ కరివేద చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కర్ర రవీందర్, దొమ్మాట జగన్‌రెడ్డి, బీమ్‌రెడ్డి మల్లారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండిపెల్లి నారాయణగౌడ్, బోయిని జయరాజు, వేల్పుల వెంకటస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు చింతకింది శంకర్, చెప్యాల రవీందర్, మల్లయ్య, సంతోష్‌రెడ్డి, ముంజ శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత



**శివ్వంపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు సర్పంచ్ రాములు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నింగన బోయిన రాములు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి మంజూరి అవుతున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సకాలంలో చేసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్తపేట గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వం నుండి మంజూరైన 500 స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, వార్డు సభ్యులు సారా మంజుల, మంగళపర్తి ప్రభాకర్, మస్కూరి ఆంజనేయులు, భరత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తోపాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# రేగోడ్‌లో మండల స్థాయి సమీక్ష సమావేశం

- **పలువురు ప్రజాప్రతినిధులు గైర్హాజరు**





**రేగోడ్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** రేగోడ్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సర్పంచులు గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొండాపూర్ సర్పంచ్ పాండరి తమ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరగడం లేదని తహసీల్దార్ దత్తారెడ్డిని ప్రశ్నించారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియ కారణంగా ఆలస్యం జరిగిందని, త్వరలో పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. దోసపల్లి సర్పంచ్ పట్టాభూమి నిషేధిత జాబితాలో ఉండటంతో రైతుభరోసా అందలేదని పేర్కొనగా, వ్యవసాయ అధికారి శ్రీదేవి రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కొండాపూర్ పీహెచ్‌సీలో రాత్రివేళ వైద్యుడు అందుబాటులో ఉండాలని కోరగా, ఉన్నతాధికారులకు నివేదిస్తామని డాక్టర్ వికాస్ తెలిపారు. పెద్దతండా సర్పంచ్ సంగ్యానాయక్ ఇళ్ల మంజూరులో అర్హులందరికీ న్యాయం చేయాలని కోరారు. సమావేశానికి పలువురు సర్పంచులు గైర్హాజరయ్యారు.

# తారా కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 18(జనంసాక్షి):** తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో డిగ్రీ విద్యార్థులకు బోధించేందుకు వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీబీఏ-రిటైల్ ఆపరేషన్స్, బీసీఏ (కంప్యూటర్ అప్లికేషన్స్) విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని తెలిపారు. బోధనా అనుభవం, జాతీయ అర్హత పరీక్ష, రాష్ట్ర అర్హత పరీక్ష, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 19న తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే ప్రదర్శన బోధన, ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు వాటి ఒక జిరాక్స్ ప్రతుల సెట్‌ను వెంట తీసుకురావాలని ప్రిన్సిపల్ తెలిపారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వ్యక్తిత్వ వికాస శిక్షణ..

- **GMR ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమగ్ర వ్యక్తిత్వ వికాస కార్యక్రమం**



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించేందుకు GMR ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమగ్ర వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. GMR ఫౌండేషన్ చైర్మన్, BRS పార్టీ నాయకులు గుజ్జపు మచ్చేందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నారాయణఖేడ్‌లోని సాహిత్య శ్రీ, యువ చైతన్య డిగ్రీ కళాశాలలు, ఇంటర్మీడియట్ కళాశాల, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టల్, మైనారిటీ కళాశాల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. విద్యతో పాటు నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం కూడా విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని జిఎంఆర్ నిర్వాహకులు తుకారం పేర్కొన్నారు.

# చండీ గ్రామపంచాయతీకి వైకుంఠ రథం అందజేత



**శివ్వంపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** మండలంలోని చండీ గ్రామపంచాయతీకి ఫ్లెమింగ్ లాబొరేటరీస్ పరిశ్రమ యాజమాన్యం వైకుంఠ రథాన్ని అందజేసింది. మాజీ జెడ్పీటీసీ పబ్బా మహేశ్ గుప్తా సహకారంతో రథాన్ని అందించినట్లు సర్పంచ్ గైనబైటి ప్రవీణ్ గౌడ్ తెలిపారు. ఫ్లెమింగ్ కంపెనీ ఎండీ ప్రకాశ్ ఆధ్వర్యంలో కే.మనోహర్, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, ఎస్‌కే కరీముల్లా పాల్గొన్నారు. గ్రామపంచాయతీకి సహకారం అందించిన పరిశ్రమ యాజమాన్యానికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమానికి పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కొండోజీ వినోద సంజీవచారి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగల చోరీ నిందితుడి అరెస్ట్



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** వ్యవసాయ బోరుమోటార్‌కు సంబంధించిన విద్యుత్ తీగలను చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

ఎస్‌ఐ సుజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న మరియంపూర్, చినిగేపల్లి శివారులో బోరుబావికి సంబంధించిన రూ.5 వేల విలువైన 40 మీటర్ల విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయి. రైతు బక్కారెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాల్‌కల్‌కు చెందిన ఫకీర్ మోహిన్ (20) చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

గురువారం గంగువార్ కూడలి వద్ద వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా పట్టుబడిన మోహిన్ విచారణలో చోరీని అంగీకరించాడు. దీంతో అతడిని అరెస్టు చేసి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## పీఆర్‌సీ మా హక్కు.. భిక్ష కాదు

**కొండపాక, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
25 ఏళ్ల కష్టంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించుకున్న మమ్మల్ని సమాజం ముందు కోటీశ్వరులుగా చిత్రీకరించడం బాధాకరమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలు, వైద్య ఖర్చులు, పిల్లల చదువులు, బ్యాంకు ఈఎంఐల భారంతో ప్రతి నెలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.
పీఆర్‌సీ తమను కోటీశ్వరులను చేసేది కాదని, పెరుగుతున్న ధరల నుంచి కుటుంబాలను కాపాడుకునేందుకు కనీస అవసరమని పేర్కొన్నారు.
2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి 30 ఏళ్ల సేవ అనంతరం తగిన పెన్షన్ భరోసా లేకపోవడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. న్యాయమైన పీఆర్‌సీ అమలు చేసి, పెన్షన్ భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అప్పులు, ఆర్థిక ఒత్తిళ్లతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీస మానవత్వంతో తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు.

# తల్లుల ఆరోగ్యమే ఆరోగ్యవంతమైన తరానికి పునాది

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** తల్లుల ఆరోగ్యమే ఆరోగ్యవంతమైన తరానికి పునాది అని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. శుక్రవారం ఉట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామ రైతువేదికలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారంపై కలెక్టర్ అవగాహన కల్పించారు.
గర్భధారణ ప్రారంభం నుంచే తల్లి ఆరోగ్యం, పోషకాహారంపై శ్రద్ధ వహించాలని సూచించారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు అందించాలని, మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తెలిపారు. బాలింతలు సంప్రదాయ నమ్మకాలతో ఆహారాన్ని పరిమితం చేయకుండా వైద్యుల సూచనల మేరకు



సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. పిల్లలకు అధిక ఉప్పు, నూనెతో కూడిన ప్యాకేజ్డ్ స్నాక్స్, జంక్ ఫుడ్‌కు బదులు పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు వంటి పోషకాహారం అందించాలని సూచించారు.
18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేయకుండా చట్టాన్ని పాటించాలని, బాలికలు విద్యను కొనసాగిస్తూ ఆరోగ్యంగా ఎదిగేలా కుటుంబ సభ్యులు సహకరించాలని కలెక్టర్ కోరారు. గర్భిణుల ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి వైద్య సేవలు అందేలా ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్ఎం సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందించాలని తెలిపారు. తక్కువ బరువు, పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు అదనపు పోషకాహారం సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని సూచించారు. నిడుగుర్తి గ్రామం మహిళలు, పిల్లల ఆరోగ్యం, పారిశుద్ధ్యంలో ఆదర్శంగా నిలిచేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో రాజేందర్‌గౌడ్, సర్పంచి రాములు, సీడీపీవో వెంకటేశ్వరమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వైభవంగా న్యాయవాది శివకుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**శివ్వంపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** ప్రముఖ హైకోర్టు న్యాయవాది, శ్రీ గురుపీఠం ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారికి వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ గోశాలను సందర్శించి గోవులకు పశుగ్రాసం అందించారు. శ్రీ విఘ్నేశ్వర, మహాలక్ష్మి, సాయినాథ, శ్రీ వేంకటేశ్వరస్వామి పూజలు నిర్వహించారు. పేద ప్రజల కోసం తన శక్తిమేర సామాజిక సేవ కొనసాగిస్తానని శివకుమార్ గౌడ్



తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వేద పండితులు వామనశర్మ, ట్రస్ట్ సభ్యులు, అనుచరులు పాల్గొన్నారు.

## వాహన భద్రతకు 'సంపర్క్' క్యూఆర్ సంకేతం

**• నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 17(జనంసాక్షి):**
వాహన యజమానుల భద్రత, గోప్యతను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఎన్‌జీఎఫ్132 సంపర్క్ వాహన భద్రత క్యూఆర్ సంకేతాన్ని ఇస్తుందని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి అన్నారు.
ఈ సందర్భంగా డిఎస్పి క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌ను విష్కరించారు. ఎన్‌జీఎఫ్132 సంపర్క్ అనేది అత్యవసర సమయాల్లో వాహన యజమానిని సులభంగా సంప్రదించేందుకు ఉపయోగపడే క్యూఆర్ సంకేత ఆధారిత వ్యవస్థ. వాహనంపై యజమాని వ్యక్తిగత ఫోన్ నంబర్‌ను బహిరంగంగా ప్రదర్శించాల్సిన అవసరం లేకుండా, క్యూఆర్ సంకేతాన్ని ఉపయోగించి అవసరమైన సమయంలో యజమానిని సంప్రదించవచ్చు. పార్కింగ్ సమస్యలు, అత్యవసర పరిస్థితులు, వాహన గుర్తింపు వంటి సందర్భాల్లో ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పంపిణీదారులు తెలిపారు.




కార్లు, ద్విచక్ర వాహనాలు, స్కూటర్లు, ఆటోలు, వాణిజ్య వాహనాలకు కూడా ఈ క్యూఆర్ సంకేతాన్ని వినియోగించవచ్చన్నారు. వాహన యజమానుల వ్యక్తిగత సమాచార గోప్యతను కాపాడుతూ, అత్యవసర సమయాల్లో వేగవంతమైన సంప్రదింపులకు ఇది ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## చిన్నగనాపూర్ సొసైటీలో రూ.8.18 లక్షల అవకతవకల ఆరోపణలు

**కొల్చారం, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** చిన్నగనాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో రైతుల సమస్యలు, సొసైటీ నిర్వహణపై శుక్రవారం జరిగిన మహాసభలో తీవ్ర చర్చ జరిగింది. సొసైటీ రికార్డులను సక్రమంగా ఆడిట్ చేయలేదని, రుణమాఫీ విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. సీఈఓ, పాలక వర్గాన్ని తప్పించాలని మహాసభలో తీర్మానం చేసినట్లు తెలిపారు.
సీఈఓ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో పాలక వర్గ సభ్యులు మాజీ సీఈఓ కృష్ణ సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపించారు. సొసైటీలో రూ. 8.18 లక్షల మేర నిధుల అవకతవకలు జరిగినట్లు మహాసభలో




ఆరోపణలు వచ్చాయి. సొసైటీ రికార్డులు, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని సభ్యులు డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ మందనాగులు, బాగారెడ్డి, సురేందర్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**చేర్యాల, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
ప్రజలు బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం చేర్యాలలో యూనియన్ బ్యాంక్ 14వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, వ్యాపారులు బ్యాంకు అందించే వివిధ రకాల రుణాలు, పథకాలు, ఆర్థిక సేవలను వినియోగించుకోవాలని సూచించారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ పంటల సాగుతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. రైతులకు అనేక రుణ సదుపాయాలు అందుబాటులో



ఉన్నాయని తెలిపారు. ప్రతి కుటుంబం ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి సామాజిక భద్రతా పథకాలను అర్హత మేరకు ఉపయోగించుకోవాలని సూచించారు. 14 ఏళ్లుగా ఖాతాదారులకు సేవలందిస్తున్న బ్యాంకు భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తుందని అధికారులు తెలిపారు.

## మెదక్ నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం

**ఎస్ఐఆర్ పక్రియ, ఓటర్ల మ్యాపింగ్, నోటీసుల విచారణపై విస్తృత చర్చ**

**మెదక్ టౌన్ సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
34-మెదక్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మెదక్ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీమతి రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

**సమావేశంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్...**

ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సంబంధిత ప్రక్రియలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్లు, మ్యాపింగ్ చేయని ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై నిర్వహించే విచారణ (హియరింగ్ ప్రాసెస్) విధానాన్ని ఆర్డీఓ రమాదేవి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.
విచారణ సమయంలో ఓటర్లు సమర్పించే ఆధారాలు, సంబంధిత పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా తగిన నిర్ణయాలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు.
అదేవిధంగా ఓటరు దరఖాస్తుల పరిశీలన, ప్రాసెసింగ్ విధానంపై కూడా సమావేశంలో చర్చించారు. ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరు నమోదుకు సమర్పించే ప్రతి



దరఖాస్తుకు డిక్లరేషన్ తప్పనిసరిగా జత చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారులు స్పష్టం చేశారు.
34-మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీఓ శ్రీమతి రమాదేవి కోరారు.
ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీ లక్ష్మణ్ బాబు, ఎన్నికల విభాగం సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలింపు.. రెండు టిప్పర్లు పట్టివేత

**తెలకపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** నిర్ణీత సమయం దాటిన తర్వాత ఇసుక రవాణా చేయడంతో పాటు, అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై యం రమేష్ తెలిపారు. శుక్రవారం సందర్భంగా వారు తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 16న సాయంత్రం 7 గంటల సమయంలో నిర్ణీత సమయం దాటిన తర్వాత ఇసుక రవాణా చేస్తున్న AP-39-TV-4518 నంబర్ గల టిప్పర్‌ను పట్టుకుని, జరిమానా విధించేందుకు తెలకపల్లి తహసీల్దార్‌కు అప్పగించారు.
దీనిపై తహసీల్దార్ రూ. 25,000 జరిమానా విధించారు. అదేవిధంగా సెప్టెంబర్ 17న సాయంత్రం 7 గంటల సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న TG-06-T-1202 నంబర్ గల



టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. అనంతరం జరిమానా విధించేందుకు తహసీల్దార్‌కు పంపగా, రూ. 25,000 జరిమానా విధించారు. రెండు వాహనాలపై కలిపి మొత్తం రూ. 50,000 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# 65వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

## రోడ్డు ప్రమాద బాధితులకు ఎస్పీ తక్షణ సహాయం





**సదాశివపేట, సెప్టెంబర్ 18(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది 65వ జాతీయ రహదారి నందికంది గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా సదాశివపేటలోని ఊబ చెరువు వద్దకు వెళ్తున్న ఎస్పీకి మధ్యాహ్నం సుమారు 1.15 గంటల సమయంలో నందికంది సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగినట్లు సమాచారం అందింది. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న ఆయన క్షతగాత్రుల పరిస్థితిని పరిశీలించి, పోలీసు సిబ్బంది, స్థానికుల సహకారంతో వారిని పోలీసు వాహనం, అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. ప్రమాదంలో కంది గ్రామానికి చెందిన శివలీల, ఉత్తర్పల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బి.సంతోష్, బీదర్ జిల్లాకు చెందిన ద్విచక్రవాహనదారుడు ఎన్.అమర్ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీ సత్యయ్య గౌడ్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్పీ వెంట ఉన్నారు.

# శ్రీరంగాపూర్ మండల సమావేశంలో పలు సమస్యలపై చర్చ



**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ సుధారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూ శాఖలో 6,226 రేషన్ కార్డుల ప్రింటింగ్ పూర్తయిందని తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. 22(ఏ) నిషేధిత భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారి హైమావతి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, గతేడాది 453 మి.మీ.కు బదులుగా ఈ ఏడాది 285 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. రైతుబీమా కింద 35 కుటుంబాలకు రూ.1.75 కోట్లు అందించామని తెలిపారు. వినాయక నిమజ్జనాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్సై హిమబిందు చెప్పారు. సోమవారం నుంచి మండల కేంద్రంలో 24 గంటల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని వైద్యాధికారి రాముడు తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను స్పెషల్ ఆఫీసర్ ఆదేశించారు.

# సమానత్వ రాజ్య స్థాపనకు విద్యార్థులు కృషి చేయాలి




**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** మహనీయులు కలలు కన్న సమానత్వ రాజ్య స్థాపనకు విద్యార్థులు కృషి చేయాలని ఎంఎస్ఎఫ్ వనపర్తి జిల్లా కో-ఇన్‌చార్జీలు మొలకలపల్లి పరశురాముడు, మీసాల గణేష్ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ ఆదేశాలతో ఎస్సీ రిజర్వేషన్ల ఏబీసీడీ వర్గీకరణ సాధించామని, దాని ఫలాలను మాదిగ విద్యార్థులు అందుకోవాలని అన్నారు. అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎస్ఎఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా కేశపాగ వంశీకుమార్, ఉపాధ్యక్షులుగా దివ్య, చామంతి, ప్రధాన కార్యదర్శులుగా హేమంత్, వంశీ, కార్యదర్శులుగా మనోహర్, పవన్ ఎన్నికయ్యారు. జిల్లా నాయకుడు పుట్టపాగ అజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్తదొమ్మాట కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా నరసింహులు



**చేర్యాల, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండలం కొత్తదొమ్మాట గ్రామ శాఖ అధ్యక్షుడిగా కర్రె నరసింహులు ఎన్నికయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు మంజ మల్లేశం ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా రాజు రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎనుముల కిషోర్, జనరల్ సెక్రటరీగా పచ్చిమట్ల పరశురాములు, సెక్రటరీగా తాండ్ర సంపత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంజ మల్లేశం మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రమాదవశాత్తు రెండు ఏటీఎంలు దగ్ధం

- లక్షల రూపాయలు కాలి బూడిద



**జోగిపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** జోగిపేట పట్టణంలో ప్రమాదవశాత్తు రెండు ఏటీఎంలో అగ్నికి ఆహుతి అయ్యాయి. గురువారం అర్ధరాత్రి బస్టాండ్ వెనకాల మయూర కాంప్లెక్స్ ఉన్న ఎస్బిఐ ఏటిఎం, యూనియన్ బ్యాంక్ ఏటిఎంలు గత కొన్నిళ్ళుగా నడుస్తున్నాయి అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అందులో నుండి మంటలు వ్యాపించడంతో పక్కా ఇంటి వారు ఇంటి వారికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఫైర్ స్టేషన్ కి తెలుపుతూ బ్యాంకు సిబ్బందికి తెలిపారు. ఫైర్ వాహనం వచ్చేవరకు పూర్తిగా కాలిపోయింది. అందులో ఎంత డబ్బు ఉంటుందో బ్యాంకు అధికారులు సైతం బేరీజు చేయలేకపోతున్నారు. ఏటీఎం అధికారులు వస్తేనే దాని లెక్క తేలుతుందని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. ఇంకా అందులో ఎన్ని లక్షలు కాలి బూడిద అయ్యాయో తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జోగిపేట పోలీసులు తెలిపారు.

# కేసీఆర్ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి




**మద్దూరు, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** గిరిజనుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రూ.13 వేల కోట్లు ఖర్చు చేశామని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. 4 వేలకుపైగా తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. గిరిజన రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచిన సందర్భంగా శుక్రవారం మద్దూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో గిరిజన నాయకులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. అనంతరం రెనివట్లలో రఘు కట్టే సాబ్ ఉర్సులో పాల్గొని ప్రార్థనలు చేశారు. కృష్ణ దేవాలయంలో వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీరం లక్ష్మారెడ్డి అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన ప్రజలు



**కొల్లాపూర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** సింగోటం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి (87)గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతితో సింగోటం, కొల్లాపూర్ నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం కొల్లాపూర్‌లోని హర్షవర్ధన్‌రెడ్డి స్వగృహంలో ఉంచిన పార్థివ దేహాన్ని వివిధ పార్టీల నాయకులు, ప్రజలు, అభిమానులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు అంతిమయాత్రను నిర్వహించారు. కొల్లాపూర్ పురవీధుల గుండా సాగిన యాత్రలో నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. అనంతరం పార్థివదేహాన్ని సింగోటం గ్రామానికి తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

**కృష్ణ, సెప్టెంబర్ 18, (జనంసాక్షి):** కృష్ణ మండలం ముడుమాల్ గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ ను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం అందాజు 8:30 గంటల సమయంలో కృష్ణ పోలీస్ వారు గస్తీ తిరుగుతుండగ ముడుమాల్ వద్ద ఒక టిప్పర్ అనుమానాస్పదంగా వెళుతుండగా దానిని ఆపి చెక్ చేయగా దాన్ని నిండా ఇసుక ఉన్నది. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా కృష్ణా నది నుండి యాదగిరి కర్ణాటకకు తరలిస్తున్నందువల్ల అట్టి టిప్పరు కెఎ01ఎబి8222 ను స్టేషన్ కు తరలించి టిప్పర్ యజమాని పేరు షఫీ అహ్మద్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కృష్ణ ఎస్ఐ నవీద్ తెలిపినారు.

# వృద్ధుల హక్కుల పరిరక్షణకు ఉచిత న్యాయ సహాయం



**అమీన్‌పూర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** వృద్ధుల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.సౌజన్య తెలిపారు. శుక్రవారం అమీన్‌పూర్ శ్రీవాణినగర్‌లోని నెస్ట్ వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఆమె వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆశ్రమంలో వసతులు, ఆహారం, వైద్య సేవలు, పరిశుభ్రత, భద్రతను పరిశీలించారు. వృద్ధుల సమస్యలను తెలుసుకుని న్యాయ సహాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వృద్ధులను గౌరవంగా, ప్రేమతో చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైతే ఉచిత న్యాయ సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

- మండల ఆరెకటిక సంఘం అధ్యక్షుడు-వెంకటేష్



**గండీడ్,సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** గండీడ్ మండలంలోని ఆరెకటిక సంఘం సభ్యులందరూ సంఘం ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల అధ్యక్షుడు, ఈరకారి వెంకటేష్ కోరారు. త్వరలో నిర్వహించనున్న మండల, జిల్లాస్థాయి సంఘం ఎన్నికల్లో ప్రతి సభ్యుడు పాల్గొని, ఓటు హక్కును, వినియోగించుకోవాలని సూచించారు.అర్హత కలిగిన ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.పేరు నమోదుకు ఆధార్ కార్డు, ఓటరుగుర్తింపు కార్డు అవసరమని పేర్కొన్నారు.ఆయా గ్రామాల సంఘం సభ్యులు తమ వివరాలను సంఘం నాయకులకు అందజేసి పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సంఘం ఐక్యత,అభివృద్ధి, బలోపేతానికి ప్రతి సభ్యుడి భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో నవీన్,రాజ్,శంకర్,జి.రాజుఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# టేకూర్‌లో నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 18, (జనంసాక్షి):** ఇందిరమ్మ గృహలక్ష్మి పథకంలో భాగంగా నిర్మించిన నూతన ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించారు. గురువారం ఇందిరమ్మ గృహలక్ష్మి లబ్ధిదారు గౌషాబి మక్బుల్‌లతో కలిసి స్థానిక సర్పంచ్ సంగీత నూతన గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికార పార్టీ శ్రేణులు నాగేశ్వర్, బక్కయ్య స్వామి, సిద్ధయ్య స్వామి, ఈరన్న, బాబురావు పాటిల్, నబి సాబ్, చౌకత్, జీవన్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో మహిళ మృతి



**పాపన్నపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** ప్రమాదవశత్తూ ఓ మహిళ మృతి చెందిన ఘటన పాపన్నపేట ఠాణా పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. బద్దం శోభరాణి (51) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం తమ వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసి అలిసిపోయింది. త్రాగు నీటి కోసం ప్రక్కనే ఉన్న మరొకరి వ్యవసాయ క్షేత్రం లోని బోరుబావి వద్దకు చేరుకొని నీరు త్రాగడానికి వెళ్ళిన క్రమంలో బోరు బావి పై పడడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుమారుడు సంపత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

## కొత్త పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం



మల్దకల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): మండల పరిధిలోనిపెద్దపల్లి గ్రామంలో శుక్రవారంఅర్హులైన వారికి కొత్త పింఛన్లు అందించేందుకు సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో కలిసి ఇంటింటా వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్,ఉపసర్పంచ్ లక్ష్మి నర్సిములు,వార్డు మెంబెర్ సుజాత,వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# బ్లూమింగ్ బర్డ్స్ కోచింగ్ సెంటర్ తో సంస్కార్ స్కూల్

• **సీజ్ చేసిన ఎంఈఓ జయరాములు**



పెబ్బేరు సెప్టెంబర్ 18 (జనంసాక్షి): పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని సంస్కార్ స్కూల్ (సిబిఎస్ఈ) గుర్తింపు అనుమతులు లేకుండా నడపబడుచున్న పాఠశాల ను శుక్రవారం సీజ్ చేశారు. మండల విద్యాధికారి యస్ జయరాములు పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించిన అనంతరం పాఠశాల ను సీజ్ చేయడం జరిగింది. ఈ ఏడాది ఆగస్టు మాసంలో ప్రారంభమైన ఈ పాఠశాలకు ప్రభుత్వం లేకపోవడంతో చర్యలు చేపడుతున్నట్లు మండల విద్యాధికారి తెలిపారు. బ్లూమింగ్ బర్డ్స్ కోచింగ్ సెంటర్ అనుమతి ఉందని, ఇది చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని ఎంఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో విద్యార్థులు ఆన్లైన్లో ఏ పాఠశాలలో నమోదు కాబడినారో అక్కడికే విద్యార్థులను పంపించాలని ఆదేశించారు. "విద్యాశాఖ నుండి గుర్తింపు అనుమతులు పొందకుండా పాఠశాల తరగతులను నిర్వహించడం పాఠశాల విద్య జీవో ఎంఎస్ నెం.1 ప్రకారం చట్టరీత్యా నేరం మరియు అట్టి నిర్వాహకులకు జరిమానాతో పాటు మరియు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ నిబంధనల మేరకు తగు చర్యలు గైకొనబడతాయి. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించే ముందు ఆ పాఠశాల గుర్తింపు అనుమతులు ఉన్నాయా లేదా అనే పూర్తి వివరాలు తెలుసుకుని చేర్పించాలని కోరారు. పెబ్బేరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నరసింహా గౌడ్ సహాయ సిబ్బంది వెంకటేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

**తీగ లాగితే డొంక కదిలినట్లు..**

తీగ లాగితే డొంక కదిలినట్లు.. సంస్కార్ పాఠశాల వ్యవహారం బట్టబయలైంది. ప్రభుత్వ అనుమతి లేకుండా బ్లూమింగ్ బర్డ్స్ కోచింగ్ సెంటర్ తో సంస్కార్ ఇంటర్నేషనల్ స్కూల్ (సిబిఎస్ఈ) ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులు కూడా అదే నమ్మకంతో పాఠశాలలో పిల్లలను చేర్పించారు. ఈ బుధవారం పాఠశాల విద్యార్థిపై ప్రిన్సిపాల్ మురళి రెడ్డి చేయి చేసుకోవడంతో ఏబీవీపీ విద్యార్థి సంఘాలు జోక్యం చేసుకున్నారు. దీంతో తీగ లాగితే డొంక కదిలినట్లుగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయానికి గురయ్యారు. మళ్లీ పాత పాఠశాలలకే పరుగులు పెట్టాల్సి వచ్చింది.

# డెంగ్యూ నివారణకు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

**స్వచ్ఛతను సామాజిక బాధ్యతగా స్వీకరించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**





వనపర్తి, సెప్టెంబరు 18 (జనంసాక్షి): డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. డెంగ్యూ కేసు నమోదైన ఇంటిని సందర్శించి పరిసరాల్లో నీటి నిల్వలు, డ్రైనేజీ, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. డెంగ్యూ వ్యాప్తికి కారణమయ్యే దోమల లార్వాను నియంత్రించడంతో పాటు అవసరమైన చోట ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జ్వర లక్షణాలున్న వారిని గుర్తించి వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, ఆరోగ్య, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

**స్వచ్ఛతా హీ సేవా..**

స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించి, నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఏదుల మండలం చెన్నారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.

## రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ చేతులమీదుగా ఎస్.రంజిత్ కుమార్‌కు సన్మానం



మల్దకల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఉన్నతాధికారుల సమీక్ష సమావేశానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉప సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు పాల్వాయి ఎస్. రంజిత్ కుమార్ ను బక్కి వెంకటయ్య శాలువాతో ఘనంగా శుక్రవారం సన్మానించారు. అనంతరం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. సమాజంలోని ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడాలని, తనవంతు సహకారం పూర్తిస్థాయిలో అందిస్తానని తెలిపారు. భవిష్యత్తులో రాజ్యాధికారంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ రంజిత్ కుమార్‌కు ఆశీస్సులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్వారం ఎస్.తిరుమలేష్ పాల్గొన్నారు.

## నాగర్‌దొడ్డిలో హర్ ఘర్ జల్ అవగాహన సదస్సు



మల్దకల్, సెప్టెంబర్ 18(జనంసాక్షి): మండల పరిధిలోని నాగర్‌దొడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారంజల్ జీవన్ మిషన్ లో హర్ ఘర్ జల్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ కె.వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఆర్డబ్ల్యూఎస్ ఎం బి ఏఈఈ మిషన్ భగీరథ సిబ్బంది, లైన్‌మెన్‌లు, ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరూ తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ సద్వినియోగం గ్రామానికి అందుతున్న మిషన్ భగీరథ నీటిని సక్రమంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జార్జి, గ్రామపెద్దలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలి



అమీన్‌పూర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): యువత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు, చట్టపరమైన రక్షణలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య సూచించారు. సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అమీన్‌పూర్‌లోని గరుడ జూనియర్ కళాశాలలో శుక్రవారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చన్నారు. అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వారు, మహిళలు, పిల్లలు, వృద్ధులు తదితరులు ఈ సేవలను వినియోగించుకోవచ్చున్నారు. లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని వివరించారు.

సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయడం, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. మహిళలు, బాలల రక్షణ చట్టాలు, బాల్య వివాహాల నిరోధం, బాలల హక్కులు, మహిళలపై హింస నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా అధికారులను సంప్రదించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సౌజన్య కోరారు. అమీన్‌పూర్ ఎస్ఐ ప్రభాకర్ పోలీస్ సేవలు, చట్టపరమైన నిబంధనలు, నేరాల నివారణలో విద్యార్థుల పాత్రను వివరించారు. న్యాయవాది మాణిక్ యాదవ్ కూడా చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి ముందస్తు భద్రతా ఏర్పాట్లు



నారాయణపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): కొండారెడ్డిపల్లి చెరువు వద్ద గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం విద్యుత్, మున్సిపల్ సిబ్బందితో కలిసి నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువులో నీటిమట్టం తక్కువగా ఉండటంతో భక్తులు నీటిలోకి వెళ్లకుండా లోతట్టు ప్రాంతాన్ని గుర్తించి ప్రత్యేక నిమజ్జన మార్గం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య పనులు, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. నిమజ్జన మార్గంలో విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. పిల్లలు, వృద్ధులు నీటిలోకి వెళ్లకుండా నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.

# ఘనంగా అంతర్జాతీయ వెదురు దినోత్సవం

- కలెక్టరేట్‌లో వెదురు ఉత్పత్తుల ప్రదర్శన
- వెదురు వనరులతో ఉపాధి, ఆదాయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య




నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18(జనంసాక్షి): నాగర్‌కర్నూల్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వెదురు దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య హాజరయ్యారు.
ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వెదురుతో తయారు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శనను అదనపు కలెక్టర్ పరిశీలించారు. వెదురుతో తయారు చేస్తున్న గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు, వినియోగ వస్తువులను పరిశీలించి, వాటి తయారీ విధానం, మార్కెటింగ్ తదితర అంశాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య మాట్లాడుతూ వెదురు ప్రకృతి ప్రసాదించిన విలువైన వనరుల్లో ఒకటని అన్నారు. వెదురుతో అనేక రకాల ఉపయోగకరమైన ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. సంప్రదాయ వెదురు కళాకారుల నైపుణ్యాలను ప్రోత్సహించడంతో పాటు, ఆధునిక డిజైన్లు మరియు నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలని సూచించారు.వెదురు ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండేలా నాణ్యత, ఆకర్షణీయమైన డిజైన్లు, మార్కెటింగ్ విధానాలను మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు. వెదురు ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వెదురు కళాకారులు,చేతివృత్తిదారులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.వెదురు ఉత్పత్తుల తయారీలో నైపుణ్యం కలిగిన కళాకారులను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ, ప్రభుత్వ పథకాల ద్వారా అందే సహాయాన్ని అందించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిని ఇందిర, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటయ్య, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఉమపతి, బిసి సంక్షేమ సహాయ అధికారి శ్రీరాములు,అధికారులు, సిబ్బంది, వెదురు కళాకారులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనాలకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు




సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): జిల్లా వ్యాప్తంగా వినాయక శోభాయాత్రలు, నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు.శుక్రవారం సంగారెడ్డిలోని మహబూబ్ సాగర్ చెరువు, సదాశివపేటలోని ఊబ చెరువులను ఎస్పీ సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు, క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గణేష్ శోభాయాత్రలు సాగే మార్గాల్లో రహదారుల పరిస్థితి, అవసరమైన మరమ్మతులు, నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్, భద్రతా దీపాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.
భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని, నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన సంతోష్, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ముంగిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శ్రీకారం



న్యాల్‌కల్, సెప్టెంబర్ 18, (జనంసాక్షి): మండలంలోని ముంగి గ్రామంలో ఇందిరమ్మ గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు స్థానిక సర్పంచ్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు దృష్టి సాధించారు. గురువారం ఉదయం గ్రామ సర్పంచ్ అరుణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి భీమావ్వ, లబ్ధిదారులు, నాయకులతో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామానికి తొలి విడతలో భాగంగా 24 ఇండ్లు మంజూరయ్యాయి. ఈ పాటికే 17 ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. తాజాగా మరో మూడు ఇండ్ల నిర్మాణం కోసం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అధికార పార్టీ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ శ్రేణులు మాణిక్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, ఖలీల్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# బీచుపల్లి ఆంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.39.85 లక్షలు



ఎర్రవల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): బీచుపల్లి శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.39,85,166 వచ్చినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం విజయరాయ కల్యాణ మండపంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, మహిళా సేవా సమితి సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. 205 రోజుల కాలానికి సంబంధించిన హుండీ లెక్కించగా నోట్ల రూపంలో రూ.37,19,705, నాణేల రూపంలో రూ.2,65,461 లభించాయి. మొత్తం రూ.39,85,166 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీలో 1.680 కిలోల మిశ్రమ వెండి లభించగా, బంగారం మాత్రం లభించలేదని వెల్లడించారు.

# కాంగ్రెస్ పార్టీలోకి లింగంపల్లి యువత



నవాబ్‌పేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): లింగంపల్లి గ్రామానికి చెందిన 30 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు తానం సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి శశికళారెడ్డి సమక్షంలో యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు యువకులు తెలిపారు. అభివృద్ధిలో భాగస్వాములై పనిచేస్తామని అన్నారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# మెదక్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

- ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక
- టికెటింగ్ వ్యవస్థ ప్రారంభం.. సోషల్ మీడియా ద్వారా ప్రచారం



మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 18 (జనం సాక్షి): మెదక్ జిల్లా పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా టూరిజం రెండో విడత అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి పర్యాటక శాఖ అధికారులు గూగుల్ మీట్ ద్వారా పాల్గొన్నారు.
గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై చర్చించారు. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గుర్తించిన ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు వసతి కల్పించేందుకు హోమ్‌స్టేలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
మెట్లబావి, వెల్దుర్తి తోరణం తదితర ప్రాంతాలకు తుది మెరుగులు దిద్దాలని, పర్యాటక గైడ్లు, సెక్యూరిటీ సిబ్బంది, హౌస్‌కీపింగ్ సిబ్బందిని నియమించే అంశంపై చర్చించారు.
మెదక్ పోర్టు వద్ద ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా టికెటింగ్ వ్యవస్థను పర్యాటక దినోత్సవం రోజున ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మెదక్ పర్యాటక ప్రాంతాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేసేలా సోషల్ మీడియా వినియోగదారులు భాగస్వాములు కావాలని కోరారు.
మెదక్ పోర్టు టూరిజం అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు.
సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ టూరిజం రంజిత్ నాయక్, డైరెక్టర్ ఆఫ్ ఆర్కియాలజీ, హెరిటేజ్ అర్జున్ రావు, టూరిజం కార్పొరేషన్ అధికారులు, డెక్కన్ టైల్స్ ప్రతినిధులు, జెడ్పీసీఈఓ ఎల్లయ్య, డీఎఫ్ఓ జోజి, డీపీఆర్వో రామచంద్రరాజు, డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు, ఈడీఎం సందీప్, మున్సిపల్ కమిషనర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాల పరిశీలన



మక్తల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అదనపు కలెక్టర్ సీను శుక్రవారం స్థలాలను పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మహిళా సమాఖ్య భవనం, సెట్విన్, ఏటీసీ సెంటర్, పీహెచ్‌సీల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను పరిశీలించారు. పూర్తి నివేదికను త్వరలో ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. స్థలాల కేటాయింపుపై మంత్రి తుది నిర్ణయం తీసుకున్న అనంతరం భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని అధికారులు వెల్లడించారు. తహశీల్దార్ సతీష్‌కుమార్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్ శాలం తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



మహమ్మదాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి): విద్యార్థులకు చదువులో బలమైన పునాది వేయాలని ఎంఈఓ రాజు నాయక్ సూచించారు. శుక్రవారం గాధిర్యాల్, చౌదర్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిలు, బోధనా విధానాలను పరిశీలించారు. తరగతికి అనుగుణంగా విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన, అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరుపై శ్రద్ధ వహించి, గైర్హాజరైన వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి నూరు శాతం హాజరు సాధించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పూర్వ ప్రాథమిక తరగతుల్లో ఆటలు, పాటలు, చిత్రాలతో ఆసక్తికర బోధన చేపట్టాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.

## ఏడుపాయలలో మాలలకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలి



**కొల్చారం, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
మెదక్ జిల్లా ఏడుపాయల శ్రీ వనదుర్గాదేవి ఆలయం వద్ద మాలలకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని మాలల హక్కుల సాధన సమితి ప్రతినిధులు రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు హాల్ అవసరమని సమితి వ్యవస్థాపకుడు బొమ్మల మైసయ్య, ప్రధాన కార్యదర్శి ఆకుల పెంటయ్య, నీరుడి ఇసాక్ తెలిపారు. మంత్రి స్పందిస్తూ మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావుతో మాట్లాడినట్లు చెప్పారు. కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఏదులపల్లి నాగరాజు, సమితి సభ్యులు పాల్గొన్నారు..

## జ్యోతికి సీపీఐ నేతల ఘన నివాళి




**అమరచింత, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
అనారోగ్యంతో మృతిచెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి కే. విజయ రాములు సతీమణి జ్యోతికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, ఎం. బాలనరసింహ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ తదితరులు శుక్రవారం నివాళులర్పించారు. జ్యోతి భౌతికకాయానికి పూలమాలలు వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజా ఉద్యమాల్లో విజయరాములకు అండగా నిలుస్తూ జ్యోతి ఆదర్శ జీవితం సాగించారని నేతలు కొనియాడారు. ఆమె మరణం కమ్యూనిస్టు శ్రేణులకు తీరని లోటన్నారు. విజయరాములు మనోధైర్యంతో ముందుకు సాగాలని ఓదార్చారు. ఈ నెల 20న అమరచింతలో నిర్వహించనున్న జ్యోతి సంస్మరణ సభ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడా మైదానంలో ప్రతిభకు పట్టం!



**గోపాలపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
క్రీడలతోనే విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. గోపాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర మైదానంలో శుక్రవారం మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

**విజేతలుగా నిలిచిన జట్లు:**
అండర్-17 విభాగంలో కబడ్డీ, కోకో, వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
**బాలికల కబడ్డీ:** ప్రథమ - టీఎస్ఆర్ఈఐఎస్ బుద్ధారం, ద్వితీయ - కేజీబీవీ గోపాలపేట **బాలికల కోకో:** ప్రథమ - టీఎస్ఆర్ఈఐఎస్ బుద్ధారం, ద్వితీయ - జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, గోపాలపేట
**బాలుర కబడ్డీ:** ప్రథమ - జడ్పీహెచ్ఎస్ ఏదుట్ల, ద్వితీయ - జడ్పీహెచ్ఎస్ పోల్కేపహాడ్ **బాలుర కోకో:** ప్రథమ - జడ్పీహెచ్ఎస్ ఏదుట్ల, ద్వితీయ - జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, గోపాలపేట
**బాలుర వాలీబాల్:** ప్రథమ - జడ్పీహెచ్ఎస్ ఏదుట్ల, ద్వితీయ - జడ్పీహెచ్ఎస్ బుద్ధారం

# రోడ్డు భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రత సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి సైనేజీలు, రోడ్డు భద్రతా సూచికలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల పరిసరాల్లో విద్యార్థుల భద్రతకు అవసరమైన అదనపు సైనేజీలు ఏర్పాటు చేయాలన్నారు.
ఆర్అండ్‌బీ, పోలీస్, మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు తమ పరిధిలోని రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదాలకు కారణమయ్యే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన చోట స్ట్రీట్‌లైట్లు, రిఫ్లెక్టివ్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాద ప్రాంతాల వివరాలను తదుపరి సమావేశానికి సిద్ధం చేయాలని, నిధులు అందుబాటులోకి రాగానే కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందేలా 108 అంబులెన్స్, లైఫ్‌సపోర్ట్ వ్యవస్థలను బలోపేతం చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని అంబులెన్స్‌ల సంఖ్య, 24 గంటల సేవలు, ప్రమాద ప్రాంతాలకు చేరుకునే మార్గాలపై సమగ్ర వివరాలతో ప్రెజెంటేషన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్ అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. గణేష్ నిమజ్జనం నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. నారాయణపేట మున్సిపల్ పరిధిలో రోడ్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను అవసరమైన మేరకు మాత్రమే తొలగించాలని తెలిపారు. గత నెల ప్రమాదాలు, తీసుకున్న చర్యలు, పురోగతిపై శాఖల వారీగా నివేదికలు సిద్ధం చేయాలని, తదుపరి సమావేశాన్ని అక్టోబర్ మొదటి వారంలో నిర్వహించాలని సూచించారు.
సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ వెంకటరమణయ్య, ఆర్టీవో అధికారులు, డీఎంహెచ్‌వో డాక్టర్ జయచంద్రమోహన్, పోలీసులు, మున్సిపల్ అధికారులు, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

## బీరం లక్ష్మారెడ్డికి కన్నీటి వీడ్కోలు

- అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి అంత్యక్రియల్లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. లక్ష్మారెడ్డి మృతి తనను తీవ్రంగా కలచివేసిందని, ఆయనతో కలిసి ప్రజా సమస్యలపై పోరాటం చేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. మాజీ సర్పంచిగా, సింగిల్‌విండో అధ్యక్షుడిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రాంత అభివృద్ధికి లక్ష్మారెడ్డి కృషి చేశారని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు, మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొని నివాళులర్పించారు.


## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**మిడ్జిల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** వేముల గ్రామంలో సర్పంచ్ నాగమ్మ ఆంజనేయులు, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ మీర్జా సూచనల మేరకు నిర్వహించిన శిబిరంలో జ్వరం, దగ్గు, జలుబు, ఒంటి నొప్పులతో వచ్చిన 160 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. 37 మంది క్షయ అనుమానితుల నుంచి కఫం నమూనాలు సేకరించారు. క్షయ నిర్ధారణ అయితే ఆరు నెలలు ఉచిత మందులతో పాటు నెలకు రూ.1,000 చొప్పున ఆరు నెలలు పోషకాహార సాయం అందిస్తారని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ అధికారులు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజల సహనాన్ని పరీక్షించిన సెక్రటరీ

## కలెక్టర్ వేటుతో ఊపిరి పీల్చుకున్న ఇందువాసి గ్రామస్థులు!



**గట్టు,సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి, విధులను పూర్తిగా గాలికొదిలేసిన ఇందువాసి గ్రామ పంచాయతీ కార్యదర్శి గొల్ల శేఖర్ తీరుపై గ్రామస్థులకు విసుగు ఎత్తిపోయింది. ఆయన నిరంతర నిర్లక్ష్యం, ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేస్తున్న వైఖరితో విసిగివేసారిన ప్రజలు,ఇక లాభం లేదనుకుని నేరుగా 'ప్రజావాణి' వేదికగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు మొరపెట్టుకున్నారు.నిధుల గోల్‌మాల్‌పై ప్రజల నుంచి వచ్చిన తీవ్ర అసంతృప్తిని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్, దీనిపై తక్షణ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఎంపీవో సయ్యద్ బాసిత్ వివరాలు వెల్లడించారు. ఎట్టకేలకు సదరు అవినీతి అధికారి పీడ విరగడైందని, ఆయన నిర్వాకాలతో విసిగిపోయిన ఇందువాసి గ్రామ ప్రజలు ఈ నిర్ణయంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

## పూర్తి నివేదికలతో సర్వసభ సమావేశానికి హాజరు కావాలి



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వరుణ్‌తేజ్ తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరై గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించనున్నారు. గత సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై శాఖల వారీగా తీసుకున్న చర్యల వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంటుందని తెలిపారు. సంబంధిత చర్యలకు సంబంధించిన పత్రాలు, నివేదికల ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరై ప్రజా సమస్యల పరిష్కారంపై సమగ్రంగా చర్చించాలని ఎంపీడీవో కోరారు.

## ఇందువాసి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**గట్టు,సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** గట్టు మండలం ఇందువాసి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగంకు పాల్పడిన గ్రామపంచాయతీ కార్యదర్శి గొల్ల శేఖర్ ను సస్పెండ్చే చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజుల కిందట పంచాయతీ సెక్రెటరీ శేఖర్ పై పలు ఆరోపణలు రాగా ఉన్నతాధికారులు పలుమార్లు గ్రామంలో విచారణ చేపట్టడం జరిగిందన్నారు. పంచాయతీకి సంబంధించిన వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కార్యదర్శి విధుల్లో అలసత్వం వహించినట్లు తేలిందన్నారు. సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పించగా ఆయన ఆదేశాల మేరకు శేఖర్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని డిపిఓ పేర్కొన్నారు.

## గీతా స్కూల్‌లో ఘనంగా రైతు దినోత్సవం



**మెదక్ టౌన్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
మెదక్ జిల్లా కేంద్రంలోని గీతా స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'రైతు రాజు' నినాదంతో ఓ రైతును శాలువాతో సన్మానించారు. పాఠశాల ఇన్‌చార్జి సుగుణాకర్, పీఈటీ నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రైతులు పంటలు పండిస్తేనే సమాజానికి ఆహారం అందుతుందని, రైతు కష్టం, వ్యవసాయ రంగం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని విద్యార్థులకు వివరించారు. రైతుల పట్ల గౌరవం, వ్యవసాయ ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి రైతులను గౌరవించాలని ప్రతిజ్ఞ చేయించారు.

# ఎఫ్ఎల్ఎన్‌పై ప్రత్యేక దృష్టితో విద్యార్థుల చదువును మెరుగుపరచాలి




**ఎర్రవల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాల కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్)ను పటిష్టంగా అమలుచేసి విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శుక్రవారం ఎర్రవల్లి మండల కేంద్రం లోని 10వ బెటాలియన్‌లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, సంఖ్యా నైపుణ్యా ల్లో ఆశించిన స్థాయికి చేరేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ ట్రాకింగ్ రిజిస్టర్‌ను సబ్జెక్టుల వారీగా నిర్వహించి, ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని నమోదు చేయాలని సూచించారు. బేస్‌లైన్ నివేదిక ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తిం చి అదనపు బోధన అందించాలన్నారు. ప్రతి బుధ వారం ప్రధానోపాధ్యాయులు సమావేశం నిర్వహించి అభ్యసన పురోగతిని సమీక్షించాలని తెలిపారు. వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలని సూచించారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరు 100 శాతం ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠ శాలలో హాజరు వేసి అనంతరం ఇతర పనుల కోసం బయటకు వెళ్తున్న ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు ప్రతి నెల 15వ తేదీలోపు పాఠశాలలను సందర్శించి విద్యాబోధన, మౌలిక వసతులు, ఎఫ్ఎల్ఎన్ అమలును పరిశీ లించాలని ఆదేశించారు.

ప్యానెల్ తనిఖీ బృందాలు పాఠశాలలను షెడ్యూల్ ప్రకారం సందర్శించి లోపాలు, సానుకూల అంశా లపై నివేదికలు ఇవ్వాలని సూచించారు.

టాయిలెట్ సౌకర్యం లేని పాఠశాలల వివరాలు సమర్పించాలన్నారు. ఆధార్, అపార్, ఎస్‌హెచ్‌వీ ఆర్, ప్రశస్త్ నమోదులో పురోగతి సాధించాలని, పర్యావరణం, డ్రగ్‌ఫ్రీ విద్యాలయ కార్యక్రమాలను అమలు చేయాలని తెలిపారు.

సమావేశంలో డీఈఓ విజయలక్ష్మి, అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## వర్షుడు కురవడంతో.. పంటలకు ప్రాణం..

- ఎండిన పంటలకు జలకళ..
- రైతుల్లో చిగురించిన ఆశలు..



**మహమ్మదాబాద్,సెప్టెంబర్ 18(జనంసాక్షి):** నెల రోజులుగా వర్షం లేక ఎండుముఖం పట్టిన పంటలకు శుక్రవారం రాత్రి కురిసిన, వర్షం ఊపిరిపోసింది. మహమ్మదాబాద్ మండల వ్యాప్తంగా రాత్రి 8 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన వర్షం సుమారు గంటపాటు దంచికొట్టింది. వర్షాభావం తో నీటి తడి అందక వాడుముఖం పట్టిన మక్క,జొన్న,కంది,వరి పంటలకు ఈవర్షం జీవజలంగా మారింది. నేలలో తేమ పెరగడంతో పంటలకు మళ్లీ చిగురుటాకుల ఆశలు కనిపిస్తున్నాయని, రైతులు పేర్కొన్నారు. పంటల ఎదుగుదలకు కీలక దశలో కురిసిన వర్షంతో, సాగుకు ఊతం లభించిందని, దిగుబడిపై ఆశలు చిగురించాయని రైతులు హర్షం వ్యక్తంచేశారు.

## బిజెపి ఓబీసీ మోర్చా మండల కమిటీ నియామకం

- ప్రధాన కార్యదర్శిగా రాధా కిషన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ



**రేగోడ్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోణం విట్టల్ ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రమైన రేగో డ్ గ్రామానికి చెందిన లక్కపల్లి రాధా కిషన్‌ను నియమిస్తూ ఉత్తరువులు జారీ చేయడం జరిగిందని రాధాకిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల బిజెపి పార్టీ బలోపేతానికి తన వంతు గా ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు.

## నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ..

- డైరెక్టర్ బి.అనిల్ కుమార్

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందించే శిక్షణను నిరుద్యోగ యువతీ,యువకులు సద్విని యోగం చేసుకోవాలని శిక్షణ సంస్థ డైరెక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. 18నుంచి 50 ఏళ్ల వయసు కలిగి ఉండి వనపర్తి జిల్లా,చుట్టుప్రక్కల జిల్లాలకు చెందిన యువతీ యువకులకు వివిధ రకాల కోర్సులలో ఉచిత శిక్షణతో పాటు భోజనం,వసతి కల్పించనున్నట్లు తెలిపారు.

## హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి



**రాజోళి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసినట్లు పేర్కొన్న వ్యాఖ్యలను ఖండిస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజోళి బస్టాండ్‌లో నిరసన చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు నల్ల రిబ్బన్లు ధరించి ఆందోళన నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో వివిధ వర్గాలకు సామాజిక, రాజకీయ అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, సంబంధిత వ్యక్తిపై కఠిన చట్టపర మైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయకుమార్, గార్లపాడు భూషణం, మద్దూర్ గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డీజేలకు అనుమతి లేదు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 (జనం సాక్షి):** జిల్లాలో గణేష్ ఉత్సవాలు, శోభాయాత్రలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, మతసామరస్యంతో నిర్వహించుకోవాలని ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలకు, ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. ప్రజల భద్రత ను దృష్టిలో ఉంచుకుని డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లం ఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శుక్రవారం ఎస్పీ కార్యాలయానికి బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, సత్యయాదవ్, నందు నామాజీ తో పాటు పలువురు యువకులు వచ్చారు. వారితో ఎస్పీ మాట్లాడి ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, డీజేల నిషేధం, ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలపై వివరించారు. వృద్ధులు, చిన్నారు లు, అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణులు తదితరుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధిక శబ్దంతో కూడిన డీజేలను వినియోగించవద్దని సూచించారు.

డీజేల స్థానంలో పరిమిత శబ్దంతో స్పీకర్లు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలు, ఇతర కళారూపాలతో శోభాయాత్రలు నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఉత్తర్వుల మేరకు డీజేలకు అనుమతి లేదన్నారు. నిషేధ ఉత్తర్వులను ధిక్కరించి డీజేలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులు, యజమానులు, ఆపరేటర్లపై చర్యలు తప్పవని తెలిపారు.

ఇప్పటివరకు జిల్లాలో 120 మంది డీజే యజమాను లు, ఆపరేటర్లను పోలీసులు బైండోవర్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. నిబంధనల అమలుపై నిరం తరం నిఘా కొనసాగుతుందని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. "డీజేలకు స్వస్తి-సంప్ర దాయ కళలకు ప్రాధాన్యం" అనే సందేశంతో ఉత్సవా లను భక్తి, సంప్రదాయం, సోదరభావంతో నిర్వ హించాలని సూచించారు.

## మెదక్ పట్టణంలో డ్రై డే ఫ్రైడే

- పారిశుధ్యం, చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



**మెదక్ టౌన్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో శుక్రవారం "డ్రై డే ఫ్రైడే" నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పాత కుండీలు, పూల తొట్టెలు, టైర్లు తదితరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. "స్వచ్ఛత హీ సేవ"లో భాగంగా 9వ వార్డులోని చైతన్య భారతి హైస్కూల్‌లో విద్యార్థులకు తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియ జేసి, చెత్తను విడివిడిగా మున్సిపల్ వాహనాలకు అందించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ వస్తువు లు, జూట్, బట్ట సంచులు వినియోగించాలని కోరారు. కార్యక్రమం లో చైర్‌పర్సన్ కానుగ రాధిక భూపతిరాజు, కౌన్సిలర్లు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## బాలల బంగారు భవిష్యత్తుకు పోషకాహారమే పునాది..

- వెల్దండలో సమన్వయ సమావేశం



**వెల్దండ, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** వెల్దండ మండలంలో తొమ్మిదో పోషణ మాసం కార్యక్రమాలపై మండల స్థాయి కన్వర్జెన్స్ సమావేశం శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పోషణ మాసం కార్యక్రమాల నిర్వహణ,ప్రజల్లో పోషకా హారంపై అవగాహన కల్పించడం,అంగన్వాడీ కేంద్రాల ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులు సమగ్రంగా చర్చించారు.గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పోషకాహారం, సమతుల్య ఆహారం,ఆరోగ్యంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పోషణ మాసం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.సమావేశంలో ఎంపీడీవో సులోచన,మెడికల్ ఆఫీసర్ సింధు,వెటర్నరీ డాక్టర్ వనజ,ఏఈ పల్లవి,సీడీపీఓ భాగ్యమ్మ,ఐకేపీ సిబ్బంది కిస్తమ్మ,హెచ్.యూ.బి సునీత, సఖి అరుణ,పోషణ అభియాన్ కోఆర్డినేటర్ విజ్ఞాన్, వెంకట్, సూపర్వైజర్లు సరిత రెడ్డి, జ్యోతి, శంకరమ్మతో పాటు మండలంలోని పెద్దాపూర్, చెర్కూర్,వెల్దండ అంగన్వాడీ సెక్టార్ల టీచర్లు పాల్గొన్నారు.

## పాడైన గుడ్లు.. చిన్నారులకెలా?



**కేటీదొడ్డి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** కేటీదొడ్డి మండల కేంద్రంలోని ఓ అంగన్వాడీ కేంద్రంలో పంపిణీ చేస్తున్న కోడిగుడ్ల నాణ్యతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పాడైపోయినట్లు కనిపిస్తున్న గుడ్ల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఇలాంటి గుడ్లను చిన్నారులకు ఎలా అందిస్తారని ప్రశ్నిస్తున్నారు. నెలకోసారి ఇవ్వాల్సిన గుడ్లను సుమారు 50 రోజులకు ఒకసారి ఇస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి గుడ్ల నాణ్యతను పరిశీలించాలని కోరుతున్నారు.

## ఆత్మకూరులో 35 మందికి
# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**ఆత్మకూర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు శుక్రవారం ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 35 మంది లబ్ధిదారులకు రూ. 14,13,750 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి రహమతుల్లా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్, పట్టణ అధ్యక్షులు ఈర్లదిన్నె శ్రీను, ఆత్మకూర్ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఆత్మకూర్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాచీన హస్తప్రతుల పరిరక్షణకు సర్వే

- తాటిఆకు గ్రంథాలు, చారిత్రక పత్రాల గుర్తింపు-డిజిటలైజేషన్‌కు చర్యలు
- అదనపు కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు
- ప్రజలు, పండితులు, పరిశోధకులు భాగస్వాములు కావాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ చేపట్టిన జ్ఞాన్ భారత్ మిషన్‌లో భాగంగా జిల్లాలోని ప్రాచీన హస్తప్రతులు, తాటిఆకు గ్రంథాలు, చారిత్రక పత్రాలను గుర్తించి సంరక్షించేందుకు సర్వే ప్రారంభించినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి సర్వేను పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దేశానికి చెందిన అమూల్యమైన సాంస్కృతిక, చారిత్రక, విజ్ఞాన సంపదను భద్రపరచి భావితరాలకు అందించడమే మిషన్ ఉద్దేశ్యమన్నారు.

జిల్లావ్యాప్తంగా లభించే పురాతన హస్తప్రతులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటలైజ్ చేసి నేషనల్ డిజిటల్ రిపాజిటరీలో భద్రపరుస్తామని తెలిపారు. 75 ఏళ్లకు పైబడిన హస్తప్రతుల వివరాలను దేవాలయాలు, మఠాలు, విద్యాసంస్థలు, గ్రంథాలయాలు, మ్యూజియంలు, పరిశోధకులు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద నుంచి సేకరించనున్నట్లు పేర్కొన్నారు. సర్వే పూర్తిగా స్వచ్ఛందమని, వివరాలు నమోదు చేసినంత మాత్రాన యాజమాన్య హక్కులు మారవని స్పష్టం చేశారు. అసలు ప్రతులు యజమానుల వద్దే ఉంటాయని, అవసరమైన శాస్త్రీయ సంరక్షణ చర్యలతో కేవలం డిజిటల్ కాపీలు రూపొందిస్తామని వివరించారు.

ఆయుర్వేదం, జ్యోతిష్యం, గణితం, విజ్ఞానం, తత్వశాస్త్రం, పురాణాలు, స్థానిక చరిత్ర తదితర అంశాలకు సంబంధించిన హస్తప్రతులు, ఏ లిపిలో ఉన్నా సర్వేలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. హస్తప్రతులు కలిగిన వారు జ్ఞాన్ భారత్ మిషన్ అధికారిక పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేయవచ్చున్నారు.

ప్రజలు, పండితులు, పరిశోధకులు, స్వచ్ఛంద సంస్థలు మిషన్‌లో భాగస్వాములై తమ వద్ద ఉన్న లేదా తెలిసిన ప్రాచీన హస్తప్రతుల వివరాలను అందించాలని కలెక్టర్ కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా నోడల్ అధికారి రమేష్‌ను సంప్రదించాలని సూచించారు.

# బీసీ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి - వి. హనుమంతరావు



**గద్వాల, సెప్టెంబర్ 18(జనంసాక్షి):** గద్వాల పట్టణంలోని వైఎస్సార్ చౌక్ మరియు పాత బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన బీసీ హక్కుల సింహగర్జన సభకు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు, బీసీ సంఘాల ప్రతినిధులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. సభలో బీసీల హక్కులు, సామాజిక న్యాయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ బీసీల రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధన కోసం వెనుకబడిన వర్గాలన్నీ రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్టసభల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో సరైన వాటా దక్కినప్పుడే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ బీసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి హక్కులను కాపాడుకోవాలని కోరారు. సభను విజయవంతం చేసిన కార్యకర్తలకు, బీసీ బంధువులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# రేపల్లె ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలి

- ప్రతి మండలంలో పౌర హక్కుల దినం నిర్వహించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 18(జనం సాక్షి);

షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయించే నిధులను సద్వినియోగం చేసుకునేలా సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.

షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన ల్యాండ్, సర్వీస్, అట్రాసిటీస్, తదితర అంశాలపై శుక్రవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, సంతు సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ కేసులను పరిష్కరించేందుకు, బాధితులకు పరిహారం చెల్లించడం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో స్పందించి ముందుకెళ్లాలన్నారు.

ప్రభుత్వం రూ.2 వేల కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను బడ్జెట్లో కేటాయించిందని, సంబంధిత వర్గాల వార్డుల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, తదితర నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపితే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో వివిధ విభాగాల్లో విధులను నిర్వహిస్తున్న కార్మికులకు భీమా సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో కులాంతర వివాహాలు చేసుకున్న వారిని ప్రోత్సహించేందుకు, విదేశీ విద్యానిధి పథకంకు ఎప్పటికప్పుడు నిధులు సమకూరేలా ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లోనూ అర్హులైన విద్యార్థులందరికీ ఉచిత విద్య అందేలా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. దళితులు, గిరిజనులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారంలోనూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవెన్యూ అధికారులను కోరారు.

రేపల్లె ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే కాక ఉద్యోగం, వ్యవసాయ భూమి కూడా ఇచ్చేందుకు ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, ఎన్జీవో ఆర్గనైజేషన్ మెంబర్ గంధం నాగరాజు, అదనపు కలెక్టర్లు మధుమోహన్ నర్సింగరావు అదనపు ఎస్పి శంకర్ ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కురుమన్న, శైలజ, మల్లికార్జున్, సురేష్ నాయక్, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి నాగరాజు, కార్పొరేషన్ ఈవో సుదర్శన్, ఎస్టి అభివృద్ధి అధికారి యాదమ్మ, ఇతర జిల్లా అధికారులు, తహసిల్దార్లు, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రతిభావంతులైన క్రీడాకారులకు మెదక్ జిల్లా నెలవు

- క్రీడలు మానసిక, శారీరక ధృఢత్వానికి దోహదం
- మెదక్ అదనపు కలెక్టర్ ఎం. నగేష్



మెదక్ టౌన్ సెప్టెంబర్ 18, (జనంసాక్షి),

క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక ధృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ ఎం. నగేష్ అన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య ( ఎస్ జి ఫ్ ) ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమానికి మెదక్ మున్సిపల్ చైర్మన్ శ్రీమతి కానుగు రాధిక భూపతిరాజ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు చదువులోనూ చక్కగా రాణిస్తారని పేర్కొన్నారు.

"మైదానంలో ఆడే ప్రతి పాయింట్ కేవలం గెలుపు కోసం మాత్రమే కాదు.. అది మీ భవిష్యత్తుకు ఒక మంచి పాఠం" అని ఆయన అన్నారు. విజయం సాధించినప్పుడు గర్వపడకుండా, ఓటమి ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా ముందుకు సాగాలని సూచించారు. ఓటమి మన లోపాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తుందని, గెలుపు మరింత బాధ్యతను పెంచుతుందని తెలిపారు.

వాలీబాల్‌లో వ్యక్తిగత ప్రతిభతో పాటు జట్టు సమన్వయం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులు పరస్పరం ప్రోత్సహించుకుంటూ, ఒకరినొకరు గౌరవించుకోవాలని, కోచ్‌ల సూచనలు పాటించాలని సూచించారు. చివరి పాయింట్ వరకు పోరాడే స్ఫూర్తిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం అదనపు కలెక్టర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో మాట్లాడారు. వ్యాయామ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు. సరైన తర్ఫీదు అందిస్తే మెదక్ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉందన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలు

**బాలుర విభాగం:** 1. పాపన్నపేట మండలం - ప్రథమ స్థానం 2. కౌడిపల్లి మండలం -- ద్వితీయ స్థానం 3. హవేలీ ఘనపూర్ మండలం - తృతీయ స్థానం

**బాలికల విభాగం:** 1. పాపన్నపేట - ప్రథమ స్థానం 2. అల్లాదుర్గ్ - ద్వితీయ స్థానం 3. శంకరంపేట్ (ఆర్) - తృతీయ స్థానం

రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెదక్‌కు పేరు తీసుకురావాలి. ముగింపు కార్యక్రమానికి పట్టణ సీఐ మహేష్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈరోజు జిల్లా స్థాయిలో పాల్గొంటున్నారని, రేపు రాష్ట్ర స్థాయిలో, ఆ తర్వాత జాతీయ స్థాయిలో రాణించి మెదక్ జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కేవలం ట్రోఫీ గెలవడమే లక్ష్యంగా కాకుండా మంచి క్రీడాకారులుగా, మంచి పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్. రాజు, ఏఎంఓ శ్రీ సుదర్శనం, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. నాగరాజు, పీఈటీ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, మధుసూదన్, పీడీలు శ్రీధర్ రెడ్డి, మాధవరెడ్డి, దేవేందర్ రెడ్డి, ఎస్. నరేష్ కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.